క్లుప్తంగా

పమిడిముక్కల ఎస్‌ఐగా శ్రీనివాస్



పమిడిముక్కల: ఎస్‌ఐగా కె.శ్రీనివాస్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఘంటసాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ కిషోర్‌కుమార్ కాకినాడ ట్రాఫిక్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌ను సిబ్బంది పరిచ యం చేసుకొని అభినందనలు తెలిపారు.

కూచిపూడి ఎస్‌ఐగా శ్రీనివాస్



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా టి.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మచిలీపట్నం వీఆర్ నుంచి ఈ స్టేషన్‌కు బదిలీపై విచ్చేశారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన డి.సందీప్ కంకిపాడు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కి హెచ్‌సీ రాంబాబు, సయ్యద్, వెంకట్రావుతో పాటు కానిస్టేబుల్ స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

నందివాడ ఎస్‌ఐగా చంటిబాబు



గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ ఎస్‌ఐగా ఎన్. చంటిబాబు గురువారం బాధ్యత లు స్వీకరించారు. 2012లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరి చాట్రాయిలో పనిచేశారు. అనంతరం గుడివాడ, ఆగిరిపల్లిలో పనిచేస్తూ బదిలీపై నందివాడ వచ్చారు.

చదరంగం పోటీల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: చెస్ టాలెంట్ కాంపిటీషన్‌లో తమ విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించి 9 పతకాలు సాధించినట్లు డాక్టర్ కేకేఆర్ గౌతమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ ఎం.సత్యారామ్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన స్కూల్ ఓపెన్ టాప్ విభాగంలో కె. సాత్విక్ మొదటి స్థానం, పి.నీరజ్‌కుమార్ మూడవస్థానం, కె. జయశంకర్ నాల్గవ స్థానం, ఎ.తజేశ్వర్ ఐదవ స్థానం, పి. యువ రెండవ స్థానం, అండర్–6 విభాగంలో ఎస్. హర్ష ప్రథమ, అండర్–7 విభాగంలో ఎం.దియాన్ సుదాన్ష్ ప్రథమ, కన్సోలేషన్ విభాగంలో కె. జయదత్త, ఎన్. దీపక్, ఆర్. యశ్వంత్‌లు పతకాలు సాధించాని తెలిపారు. ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను, కోచ్ స్వర్ణలతలను ప్రిన్సిపల్స్ పి. లక్ష్మీప్రసాద్, జ్యోతి, జబ్రీనాలు అభినందించారు.

కంప్యూటరీకరణ వెంటనే పూర్తిచేయాలి



ముదినేపల్లి రూరల్: సొసైటీల్లో కంప్యూటరీకరణ వెంటనే పూర్తిచేయాలని కేడీసీసీ బ్యాంక్ ముదినేపల్లి బ్రాంచ్ మేనేజర్ వీవీఎల్ఎస్ కుమార్ సూచించారు. మండలంలోని పెనుమల్లి సొసైటీలో కంప్యూటరీకరణ పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బ్రాంచ్ పరిధిలోని 15 సొసైటీల్లో కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ ఈ నెల 15వ తేదీ లోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మేనేజర్ వెంట సూపర్‌వైజర్ మోరు నాగభూషణం ఉన్నారు.

రైస్ మిల్లు తనిఖీ



పెదపారుపూడి: మండల కేంద్రంలోని వెంకట కనక దుర్గా రైస్‌మిల్లులో ధాన్యంను తహసీల్దార్ వెంకట మాధవరావు గురువారం తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం నిల్వలపై రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లు యాజ్యమానికి సూచించారు. ఆర్‌ఐ రవికుమార్, రీసర్వే డీటీ సుందరరావు, వీఆర్వో చాట్ల అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

కైకలూరు: ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబానికి సంబంధించి భూమిని ఆక్రమించుకున్నారనే ఫిర్యాదుపై విచారించడానికి రాచపట్నం గ్రామానికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శుక్రవారం రానున్నారు. ఉదయం 11.30 గంటలకు గ్రామానికి విచ్చేస్తారని అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన జోసఫ్ నవీన్ కుమార్‌కు చెందిన సర్వే నంబరు 117/2లో 0.32 సెంట్లు, సర్వే నంబరు 117లో 0.26 సెంట్లు అసైన్డ్ భూమి ఉంది. దీనిని కొందరు ఆక్రమించుకున్నారని ఆయన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణకు విక్టర్ ప్రసాద్ వస్తున్నారు.

జననేత జగన్‌ని ఆశీర్వదించండి



మహిళలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఆసరా వేడుకలకు భారీగా హాజరైన మహిళలు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ పాలనలో జననేత, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తూ జనం ముందుకు వస్తున్నారని ఆయన్ను తప్పక ఆశీర్వదించాలని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) కోరారు. గుడ్లవల్లేరులో గురువారం 'వైఎస్సార్ ఆసరా' సభ నిర్వహించారు. మండల పరిధిలోని 974 గ్రూపుల్లోని 9,577మంది మహిళలకు రూ.9.76 కోట్ల చెక్కును డ్వాక్రా మహిళలకు ఆయనతో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ రాష్ట్రానికి జగన్ చేసిన అభివృద్ధి, ప్రజలకు చేసిన మంచితోనే జనం ముందుకు వస్తున్నారని చెప్పారు. జనసేన, బీజేపీలతో కలిసి వస్తున్న బాబు మరోసారి కల్లబొల్లి కబుర్లు చెప్పేందుకు సిద్ధమవుతున్నాడని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు అంటూ జగన్ ఎలుగెత్తి ఆ వర్గాలకు చేసిన అభివృద్ధిని చాటి చెబుతున్నారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 70 శాతం రాజకీయ పదవులు సీఎం జగన్ ఇచ్చారని వెల్లడించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు జగనన్న ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'వైఎస్సార్ ఆసరా' ఎంతో మేలు చేకూరుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ హారిక అన్నారు. రాజకీయ వేదికలపై పురుషులతో సమాన సంఖ్యలో మహిళలు కూర్చోవడానికి మహిళలకు ఇచ్చిన రిజర్వేషన్లే కారణమన్నారు. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయ కర్త ఉప్పాల రాము, పార్టీ రాష్ట్ర నాయకుడు శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ చంటి, కేడీసీసీ డైరెక్టర్ సుజాత, ఎంపీపీ కొడాలి సురేష్, పీఏసీఎస్ అధ్యక్షులు దుగ్గిరాల శేషుబాబు, శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, కొండలమ్మ ఆలయ తొలి చైర్మన్ తాళ్లూరి మాధవ్, సర్పంచులు కోటప్రోలు నాగు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, ఆర్బీకేలు ప్రారంభం



ఆర్బీకేను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, ఎమ్మెల్యే కొడాలి తదితరులు



గ్రామ సచివాలయ శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన కొడాలి, హారిక తదితరులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో గ్రామ సచివాలయం – 2, ఆర్బీకే నూతన భవనాలను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని), జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, ఎంపీపీ కొడాలి సురేష్, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, మాజీ చైర్మన్లు కనుమూరి రామిరెడ్డి, తాళ్లూరి మాధవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, సర్పంచులు కోటప్రోలు నాగు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు



విజేతలైన క్రీడాకారులతో ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్(నందివాడ): రాష్ట్రంలో నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించి వెలుగులోకి తీసుకు రావడమే ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకత అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీల్లో విజయ పరంపరంగా గెలుస్తూ వస్తున్న పుట్టగుంట సచివాలయం జట్టు రాష్ట్ర స్థాయిలో సైతం విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ జట్టుకు మంచి భవిష్యత్ ఉందన్నారు. మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి తన వంతు ప్రోత్సాహం ఉంటుందన్నారు.

రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

ఏఎంసీ చైర్‌పర్సన్ తుమ్మల ఉషారాణి



మాట్లాడుతున్న పామర్రు మార్కెట్ యార్డు కమిటీ చైర్‌పర్సన్ ఉషారాణి

పామర్రు: రైతుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని పామర్రు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మల ఉషారాణి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతన కమిటీ సభ్యుల తొలి సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎంసీలో రైతులకు అందుబాటులో రెండు గూడౌన్‌లు ఉన్నాయని తెలిపారు. వీటిలో 2 మెట్రిక్ టన్నుల సామగ్రిని నిల్వ ఉంచే సామర్థ్యం ఉందని చెప్పారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గూడౌన్‌లో దాచుకునే ధాన్యం తదితరాలకు ఆరు నెలల వరకు ఏవిధమైన అద్దె చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అంతే కాకుండా ఉచితంగా ఇన్సూరెన్సు చేస్తామని పేర్కొన్నారు. నామ మాత్రపు రుసుంతో నిల్వలు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. తడిసిన ధాన్యం అరబెట్టుకునే వెసులుబాటు కూడా ఉందన్నారు. ఏఎంసీ పరిధిలోని డొంక రోడ్లు, లింక్‌రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎంసీ ఆదాయం వ్యయాల గురించి చర్చించామన్నారు. 2024–25 ఏడాదికి బడ్జెట్ అంచనాలు రూపొందించి చర్చించి తీర్మానించామని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నయిముద్దీన్, డైరెక్టర్లు కూసం పెద వెంకటరెడ్డి, కె.రజని, కొలుసు ఆదిలక్ష్మీ, పి.ఆదియ్య, సజ్జా వెంకట సుబ్రమణ్యేశ్వరరావు, ప్రాకర్ల లక్ష్మీ, చాట్ల నాగరత్నం, కొలుపు ధనలక్ష్మి, పి.విజయ, బి.నాగరాజు, ఎస్. రాజ్యలక్ష్మి, నందిపాటి సాంబశివప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి శివరామకృష్ణ, గ్రేడ్03 కార్యదర్శి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కైలే నేడు తోట్లవల్లూరు రాక

తోట్లవల్లూరు: వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం కృష్ణంరాజు తెలిపారు. తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాల క్రీడా మైదానంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా కింద మండల వ్యాప్తంగా 809 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 7,995 మంది మహిళలకు రూ.8.13 కోట్లు అందిస్తారన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం

పెదపారుపూడి: విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విజిలెన్స్ శాఖ ఎస్ఈ ఎం. అల్పాన్సి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, వానపాముల, దోసపాడు తదితర గ్రామాల్లో గురువారం విద్యుత్ కనెక్షన్లు తనిఖీలు చేశారు. గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో 45 బృందాలుగా ఏర్పడి 3059 గృహ సర్వీసులు, 62 వాణిజ్య సముదాలయాల సర్వీసులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్ఈ మాట్లాడుతూ మండలంలో 206 సర్వీసులకు అదనపు లోడు నమోదు చేసి 273 కిలోవాట్లు మొత్తానికి సుమారు రూ.5.46 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. విద్యుత్ చౌర్యం చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లు అయితే వెంటనే 9440812086, 9440817579 నంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ ఏడీ కె. దశరథ్, మండల ఏఈ ఎస్ఎఎస్ వరకుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి చెరువులు నింపుకోవాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని పంచాయతీల పరిధిలో ఉన్న మంచినీటి చెరువులను వెంటనే నీటితో నింపుకునేందుకు సర్పంచులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని పోల్‌రాజ్, క్యాంప్‌బెల్ కాలువల ఏఈలు కిషోర్, సిద్ధార్థ కోరారు. ముదినేపల్లిలోని నీటిపారుదల శాఖ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ ప్రస్తుతం పంట కాలువలకు నీరు విడుదల చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసే అవకాశం లేనందున కాలువల నుంచి లిఫ్ట్ చేసుకుని మంచినీటి చెరువులు నింపుకోవాలని సూచించారు. పంట కాలువల ద్వారా వచ్చే తాగునీటిని చేపల చెరువులకు మళ్లిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడి ఘటనలో వృద్ధురాలికి గాయాలు

తోట్లవల్లూరు: దాడి ఘటనలో వృద్ధురాలు గాయపడిన ఘటన మండలంలోని కుమ్మమూరులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన తోకల నాంచారమ్మ (60) గురువారం సాయంత్రం తన ఇంటి ఆరుబయట ఊడుస్తుండగా, పక్కనే నివశించే చింతలపూడి నాగేశ్వరరావు మా వైపుకి ఊడుస్తావేంటి అంటూ గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగటంతో చేతిలో ఉన్న కర్రతో నాగేశ్వరరావు నాంచారమ్మపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన నాంచారమ్మను స్థానికులు ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. విశ్వనాథ్ పేర్కొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న పీడీ రాము

కలిదిండి: గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, పీడీ ఎ.రాము తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఏప్రిల్ 2022 మార్చి 2023 వరకు జరిగిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీ జరిగింది. మొత్తం రూ.7.31 కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. 5 బృందాలతో గత నెల 27 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, వీఎస్‌లు గ్రామాల్లో పనులను తనిఖీ చేశారని తెలిపారు. ఏ గ్రామంలో కూడా 100 రోజుల పని కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.11,133 రికవరీ విధించగా, రూ.10,226 రికవరీ చెల్లించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ వీవీఎస్ శేఖర్, ఎంపీడీవో దినతేజ్, ఎస్ఆర్పీ భాస్కర్, ఈపీఆర్డీవో రాజారావు, ఏపీవో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎంఈవో ప్రభాకర్‌రావు

కలిదిండి: పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి ఉపాధ్యాయులు సహకరించాలని ఎంఈవో ప్రభాకర్‌రావు సూచించారు. గురువారం ఎంఈవో కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ రక్తహీనతకు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇచ్చే మాత్రలను పిల్లలకు అందించి యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపాడు హైస్కూల్ చెరువు వేలం



చింతపాడులో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

మండవల్లి: మండలంలోని చింతపాడు హైస్కూల్ చెరువుకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఎం.అమ్మిరాజు హెచ్చు ధర రూ.82,500లకు చెరువును దక్కించుకున్నారు. ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్, హైస్కూల్ హెచ్‌ఎం కె.ఆంజనేయులు, గ్రామస్తులు హాజరయ్యారు.

పంట కుంటలతో సాగునీటి సమస్యలకు చెక్



నున్నలో పంట కుంట పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ సునీత

నున్న(విజయవాడరూరల్): పంట కుంటలున్న గ్రామాల్లో సాగునీటి సమస్యలు తలెత్తవని ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత తెలిపారు. నున్న గ్రామంలో వజ్రాల నాగిరెడ్డి మామిడి తోటలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పంట కుంట(ఫామ్‌ఫాండ్) తవ్వకం పనులను పీడీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, ఒక మీటరు లోతు కొలతలతో తవ్విన పంట కుంటలో 36 వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉంటుందన్నారు. ఆ నీటి వలన మామిడి తోటలకు, కూరగాయ పంటలకు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వమే పంట కుంటలను ఉచితంగా తవ్విస్తోందన్నారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ అసైన్డ్ భూములున్న రైతులు కూడా పంట కుంటలను తవ్వించుకునేందుకు అర్హులన్నారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లాలో ప్రతి మండలంలో 100 పంట కుంటలను తవ్వించడానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధారించిందని చెప్పారు. మామిడి, జామ, సపోటా, బత్తాయి, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, యాపిల్ బెయిర్, పండ్ల తోటలను సాగు చేసుకొనే రైతులు నీటికుంటలను తవ్వించుకోవచ్చునన్నారు. ఆసక్తిగల రైతులు నీటి కుంటలను తవ్వించుకుని పండ్ల తోటలను, కూరగాయ తోటలను సాగు చేసుకొని అధిక ఆదాయం పొందవచ్చునని సూచించారు. నీటి కుంటలతో భూగర్భ జలాలు అభివృద్ధి అవుతాయని తెలిపారు.

భయం లేకుండా పరీక్షలు రాయండి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి

కలిదిండి: విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి, భయం లేకుండా పదో తరగతి పరీక్షలను రాయాలని కలిదిండి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.స్వర్ణకుమారి సూచించారు. ఎంఈవో ప్రభాకర్‌రావు ఆధ్వర్యాన మండల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు అందజేశారు. హైస్కూల్ నుంచి తెలుగు మీడియంలో పి.ఈశ్వరి, ఇంగ్లీష్ మీడియంలో డీవీఎల్ నరసింహ ద్వితీయ స్థానంలో నిలిచారని హెచ్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలి



మొవ్వ-2లో రిజిస్ట్రేషన్‌లు పరిశీలిస్తున్న సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు

మొవ్వ: జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని మొవ్వ సబ్ రిజిస్ట్రార్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. మొవ్వ సచివాలయం-2లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ప్రతి గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేస్తుందని తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిజిటల్ అసిస్టెంట్ కె.నవీన్ కుమార్, గ్రేడ్-5 కార్యదర్శి గుర్రం చందు భారతి ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలు, రిజిస్ట్రేషన్ ఖర్చులు లేకుండా ప్రభుత్వమే రిజిస్ట్రేషన్‌లు చేస్తుందని పేర్కొన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా లబ్ధిదారులు శాశ్వత హక్కులు పొందవచ్చన్నారు. ముందుగా మొవ్వ సచివాలయం-1, వేములమడ, కోసూరు, కాజ, నిడుమోలు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ల తీరుతెన్నులు పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ముదినేపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న వినయ్, నాయకులు

ముదినేపల్లి రూరల్: గ్రామాల్లో స్థానిక సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందని పార్టీ నియోజకవర్గ నాయకుడు దూలం ఆది వినయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం ముదినేపల్లిలో గురువారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వ్యక్తిగత సమస్యలతో పాటు సామూహిక సమస్యలు పరిష్కరించేందుకు పార్టీ నాయకులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సచివాలయ పరిధిలోని వలంటీర్లతో పాటు పార్టీ స్థానిక నాయకుల సహకారాన్ని తీసుకోవాలన్నారు. వినయ్ వెంట ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు, నాయకులు కొల్లి నాని, దివి సతీష్, పేర్ని పృధ్వీ తదితరులు ఉన్నారు.

ఇష్టపడి చదవాలి

- డీఈఓ తాహెరాసుల్తానా
- పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న డీఈఓ తాహెరాసుల్తానా

కోడూరు: పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదవాలని డీఈఓ తాహెరాసుల్తానా అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో గురువారం మండలంలోని స్వతంత్రపురం, వి.కొత్తపాలెం, లింగారెడ్డిపాలెం, సాలెంపాలెం, బడేవారిపాలెం జెడ్పీ పాఠశాలల పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశకు అత్యంత కీలకమైనవి పదో తరగతి పబ్లిక్ పరీక్షలేనని, వీటిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే భవిష్యత్ బాగుంటుందని డీఈఓ అన్నారు. తరగతిలో విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా ఉపాధ్యాయులు సెక్షన్లుగా విభజించి, తక్కువ మార్కుల వచ్చేవారికి ప్రత్యేక తర్ఫీదును ఇవ్వాలని డీఈఓ ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక తరగతులు కూడా నిర్వహించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కూడా పని చేయాలన్నారు. విద్యార్థులు ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా చేయాలని సూచించారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని డీఈఓ కోరారు.

151 కేంద్రాల్లో పరీక్షలు

జిల్లాలోని 151 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ చెప్పారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, వీటిని సంబంధించి పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 395 పాఠశాలలకు సంబంధించి 26,507మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్లు డీఈఓ తెలిపారు. అనంతరం పలు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి వారి వద్ద నుంచి సమాధానాలు రాబట్టారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో అగ్రగామి భారత్

కోనేరుసెంటర్: రసాయన శాస్త్ర విభాగంలో భారతదేశం ప్రపంచంలోని అగ్రగామి దేశాలతో పోటీ పడుతోందని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సి.సురేష్ రెడ్డి తెలిపారు. 'రసాయన శాస్త్ర పరిశోధనలతో భవిష్యత్తు' అనే అంశంపై గురువారం కృష్ణా విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో అతిథోపన్యాసం జరిగింది. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో రసాయన శాస్త్ర పరిశోధనలతో భారతదేశం అగ్రగామిగా ఎదగబోతుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు.